# పంట రుణం వద్దన్న కాంగ్రెసోళ్లను రానీయద్దు

- పల్లెలను నాశనం చేసినోళ్లను అడుగుపెట్టనీయద్దు
- సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
- పంట పెట్టుబడి సాయం చేస్తున్న ఏకైక సర్కారు మాదే
- బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్



ఎరడపల్లిలో మాట్లాడుతున్న మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం, అక్టోబర్ 31: రైతులకు పంట రుణాలు నిలుపుదల చేయాలన్న కాంగ్రెసోళ్లను పల్లెల్లో అడుగుపెట్టనీయవద్దని బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. నాడు పల్లెలను నాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని, ఈ విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. తాను ఎమ్మెల్యే పదవి చేపట్టాక మానకొండూర్ నియోజకవర్గంలో పల్లెలు పచ్చగా కళకళలాడుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి, అర్కండ్ల, ముత్తారం, మక్త గ్రామాల్లో రసమయి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అభివృద్ధి నిరోధకుల చేతులకు అప్పగించవద్దని హితవు పలికారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని పునరుద్ఘాటించారు. చెరువుల్లో నీళ్లు 24 గంటలు మత్తడి దుంకుతున్నాయని చెప్పడానికి గర్వపడుతున్నామన్నారు. ఎరడపల్లిలో కోట్లాది రూపాయలతో వంతెనలు నిర్మించామని గుర్తు చేశారు. ముత్తారం స్వచ్ఛతకు మారు పేరుగా నిలిచిందని ప్రశంసించారు. అర్కండ్లలో మౌలిక వసతులు కల్పించగా, మక్తకు జీపీ హోదా కల్పించి ఇక్కడి ప్రజలు గర్వంగా తలెత్తుకునేలా చేసిన ఘనత తమదేనన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. దేశంలో పంట పెట్టుబడి సాయం చేస్తున్న ఏకైక సర్కార్ తమదేనన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపిస్తే తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ₹5 లక్షల బీమా సౌకర్యం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో లాగా అన్ని గ్రామాల్లో దళితబంధు అమలు చేసి తీరుతామని చెప్పారు. స్థలం లేని వారికి ఇల్లు కట్టుకునే వారందరికీ స్థలం కొని ₹3 లక్షలు అందజేస్తామన్నారు. తెలంగాణలో ఉన్నన్ని పథకాలు ఏ రాష్ట్రంలో లేవని గుర్తించాలన్నారు. కవ్వంపల్లి ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తనను దీవిస్తే కేసీఆర్‌ను దీవించినట్లేనని మరిచిపోవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి విజయాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలకు రాగా, డప్పులు, కోలాటాలు, నృత్యాలతో, పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొత్తగట్టుకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు ఎరడపల్లిలో బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎల్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, సర్పంచులు రంజిత్‌రావు, చేర్ల అనిత, పంజాల రేణుక, నెలవేని సుష్మ, ఎంపీటీసీ సంపత్, ఏఎంసీ వైస్ చైర్మన్ వీరస్వామి, యూత్ మండలాధ్యక్షుడు అలీమొద్దీన్, బీఆర్ఎస్ మండల మహిళా ఉపాధ్యక్షురాలు తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

- జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి
- నూతన కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, అక్టోబర్ 31: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, జిల్లాకు మంచి పేరు తెచ్చేందుకు సహకరించాలని అధికారులకు, సిబ్బందికి నూతన కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇక్కడికి కలెక్టర్‌గా సోమవారం సాయంత్రం బదిలీ చేయగా, మంగళవారం ఉదయం కరీంనగర్‌కు చేరుకున్నారు. ఆ వెంటనే విధుల్లో చేరారు. ఆ తర్వాత అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. విధి నిర్వహణలో ఒడిదొడుకులు సర్వసాధారణమని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే చేస్తున్న ఉద్యోగానికి సరైన న్యాయం చేసినవారమవుతామని అన్నారు. ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ సమిష్టి కృషితో పనిచేద్దామని చెప్పారు. అంతకుముందు కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌కు వచ్చిన కలెక్టర్‌కు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కలెక్టర్‌తో కలిసి అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ తదితరులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు జిల్లా అధికారుల సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. స్వాగత కార్యక్రమంలో ఆర్డీవో కే మహేశ్వర్, డీపీవో కొమురయ్య, డీఏవో వాసిరెడ్డి శ్రీధర్, డీఆర్డీవో ఎల్ శ్రీలత, డీటీవో డీడీయూ నాగరాజు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీ ఓటు రైతుబంధుకా.. రాబందులకా..?

- కాంగ్రెస్ వస్తే సంక్షోభమే
- స్థానిక బిడ్డగా ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్
- చొప్పదండి మండలంలో ఎన్నికల ప్రచారం



భూపాలపట్నంలో సుంకె రవిశంకర్‌కు గజమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు

చొప్పదండి, అక్టోబర్ 31: 'అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదు. ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంక్షోభం, అంధకారమే మిగులుతుంది. కర్ణాటక లెక్క కరెంట్‌కు గోసపడాల్సిందే. టార్చ్‌లైట్ పట్టుకొనే పొలాల దగ్గరికి వెళ్లి కరెంటు పెట్టుకొని, అక్కడే పండుకుని పరిస్థితి మళ్లీ వస్తుంది. ప్రజలారా మీ ఓటు రైతుబంధుకు వేస్తారో..? లేదా రాబందులకు వేస్తారో..? ఒక ఆలోచించండి. కాంగ్రెస్, బీజేపీ కల్లబొల్లి మాటలు నమ్మకండి. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష' అని బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని విమర్శించారు. తాను స్థానికుడినని, అందరికీ అందుబాటులో ఉంటున్నానని, ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తున్నానని చెప్పారు. స్థానిక బిడ్డగా తనను మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. చొప్పదండి మండలం భూపాలపట్నం, వెదురుగట్ట, కొలిమికుంట, చాకుంట గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని చూసి కాంగ్రెస్, బీజేపీ వాళ్ల కండ్లు మండుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉందన్నారు. వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇవ్వడం లేదని విమర్శిస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇక్కడికొచ్చి కరెంటు తీగలు పట్టుకొని చూడాలని సవాల్ విసిరారు. మూడు గంటలు కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి, రైతుబంధు వద్దని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు, నిరంతర విద్యుత్ రెండూ బంద్ అవుతాయని, ప్రజలు ఆలోచన చేసి ఓటేయాలని కోరారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేలుగా గెలిచిన వారంతా స్థానికేతరులని, వాళ్లు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. తాను లోకల్ అని, అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపానని, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నానని చెప్పారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్‌కు జడ్పీటీసీ మాచర్ల సౌజన్య, మహిళా సర్పంచులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఒగ్గుడోలు కళాకారులు, డప్పుచప్పుళ్లతో గ్రామాల్లో భారీ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య-వినయ్, పీఏసీఎస్ చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ గడ్డ చుక్కారెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు ఏలేటి లావణ్య-తిరుపతి రెడ్డి, గుడిపాటి సుచరితాదేవి, తాళ్లపల్లి సుజాత-శ్రీనివాస్, పెద్ది శంకర్, గుంట రవి, గుడిపాక సురేశ్, కౌన్సిలర్ మాడూరి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు పాషా, నాయకులు నారాయణరావు, సీపెల్లి గంగయ్య, నారాయణ, గాండ్ల లక్ష్మణ్, కొత్తూరి నరేశ్, గోపు శ్రీనివాస్‌రెడ్డి, దీటి మధు, మల్లేశం, నర్సయ్య, రావణ్ పాల్గొన్నారు.



ప్రచార ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

# ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలి

- నూతన పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి
- కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ
- పోలీస్ అధికారులతో సమీక్ష

రాంనగర్, అక్టోబర్ 31: క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళి సక్రమంగా అమలయ్యేలా పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని సీపీ అభిషేక్ మహంతి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మహంతి మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున పాటించాల్సిన నియమాలు, చేపట్టే విధుల గురించి పలు సూచనలు చేశారు. జిల్లాలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై, ఎన్నికల వేళ గొడవలు సృష్టించే వ్యక్తులపై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘ విద్రోహ శక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికల నియమావళిని అమలు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, అక్టోబర్ 31: గోవాలో జరుగనున్న 37వ జాతీయస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బసరవేణి లక్ష్మణ్ పేర్కొన్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఏ సాయికృష్ణ, జీ రమేశ్ అత్యంత ప్రతిభ చూపి జాతీయ బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని డీవైఎస్‌వో కే రాజవీరు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తదితరులు అభినందించారు.




జాతీయ బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు